
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం ၊ 29 ၊ మార్చి ၊ 2023



సోమశిలలో నీటి నిల్వ

సోమశిల: సోమశిల జలాశయంలో మంగళ వారానికి 55.013 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 357 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,840
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రాము)	రూ.5,434
3 శాతం జీఎస్టీతో	రూ.5,597
సవర (8 గ్రా)	రూ.44,776

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.6 /26.6

మంగళవారం గాలిలో 73 శాతం తేమ ఉంది. బుధవారం వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశముంది.





దీకేడబ్ల్యూ కాలేజీ వద్ద విద్యార్థినుల ఆనందం



సర్వోదయ కళాశాల ఎదుట కేరింతలు



పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

కేరింతలు కొడుతూ..

పాఠాలు వినడం.. డౌట్స్ అడగడం.. చదువుకోవడం.. టెస్ట్‌లు రాయడం.. మార్కులు చూసుకోవడం.. ఏదైనా సబ్జెక్ట్‌లో వెనుకబడి ఉంటే దానిపై ప్రత్యేక దృష్టి పెట్టడం.. సంవత్సరమంతా ఇలా గడిపిన విద్యార్థులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు మంగళవారం ముగిశాయి. నెల్లూరులోని పరీక్ష కేంద్రాలు విద్యార్థుల కేకలు, కేరింతలతో సందడిగా కనిపించాయి. హాస్టళ్లు, ఇళ్లలో పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులకు కొద్దిరోజులపాటు సరదాగా గడిపేందుకు సమయం దొరికింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

న్యూస్‌రీల్

న్యాక్ గుర్తింపు దిశగా వీఎస్‌యూ



బృంద సభ్యులతో వీసీ సుందరవల్లి

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)కి న్యాక్ గుర్తింపు వచ్చేలా కృషి చేస్తున్నట్లు వీసీ జీఎం సుందరవల్లి తెలిపారు. న్యాక్ గుర్తింపు కోసం పనిచేస్తున్న బృందాన్ని మండలంలోని కాకుటూరు వద్ద నున్న వర్సిటీలో మంగళవారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీఎస్‌యూ యూజీసీ గుర్తింపు పొందిన తర్వాత, పురోగతిని సాధించే క్రమంలో న్యాక్ అక్రిడిటేషన్‌కు వెళ్లినట్లు చెప్పారు. మంచి గ్రేడ్ సాధించాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, అంతర్గత నాణ్యత హామీ సెల్ డైరెక్టర్ అందె ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ వెంకట్రాయులు, డాక్టర్ ఎం.హుస్సేనయ్య, బోధన, బోధనేతర సిబ్బందిని అభినందించారు.

'రెడ్‌క్రాస్' అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు



ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయం

నెల్లూరు(అర్బన్): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ ఎన్నికల బరిలో 34 మంది అభ్యర్థులు నిలిచారు. 18 మంది మేనేజింగ్ కమిటీ సభ్యులను 7,704 మంది రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యులు ఓట్లు వేసి ఎన్నుకోవాల్సి ఉంది. కాగా పోటీలో ఉన్నవారికి జిల్లా సహకార అధికారి, రెడ్‌క్రాస్ ఎన్నికల నిర్వహణ అధికారి తిరుపాల్‌రెడ్డి మంగళవారం గుర్తులు కేటాయించారు. పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి కొవ్వొత్తి, బయ్యా ప్రసాద్‌కి కొబ్బరికాయ, సురేష్‌కుమార్‌జైన్‌కి హార్మోనియం, గునుపాటి ప్రసాద్‌రెడ్డికి బుట్ట, దామిశెట్టి సుధీర్‌నాయుడుకి బ్రెడ్ తదితరులకు గుర్తులు కేటాయించారు. ఏప్రిల్ 2వ తేదీన ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

క్రాంతిపథం సీసీ సస్పెన్షన్

- డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి వెల్లడి

పొదలకూరు: వైఎస్సార్ క్రాంతిపథం సీసీగా కలువాయిలో పనిచేస్తున్న వెంకటేశ్వర్లును సస్పెండ్ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి వెల్లడించారు. వైఎస్సార్ ఆసరా చెక్కులను పొదుపు మహిళలకు అందజేసేందుకు మంగళవారం పొదలకూరుకు ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంకటేశ్వర్లు గతంలో వెలుగు ప్రాజెక్ట్ కింద పొదలకూరులో సీసీగా పనిచేసిన సమయంలో మండలంలోని మొగళ్లూరు గ్రామానికి చెందిన పొదుపు సంఘాల నగదు దుర్వినియోగం చేశాడనే ఆరోపణలు వచ్చాయన్నారు. మహిళలు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించడంతో దీనిపై విచారణ నిర్వహించి ముందుగా సీసీను సస్పెండ్ చేశామన్నారు. మరో 15 రోజుల్లో అతడి నుంచి నగదును వసూలు చేస్తామన్నారు. కాగా మహిళలు ముందుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసి విషయాన్ని తెలిపారు. వెంటనే స్పందించిన మంత్రి న్యాయం చేస్తామని మహిళలకు హామీ ఇచ్చారు.

ఉపాధి పనుల్లో కీర్తిశేషుడు


అనగనగా ఓ గ్రామ పంచాయతీ. ఆ ఊర్లో చనిపోయిన వ్యక్తి ఉపాధి పనులు చేసినట్లు నమోదు చేశారు. పిల్లలు బడికి వెళ్లకుండా జాబ్‌కార్డులతో ఎండలో కష్టపడుతున్నట్లు చూపించారు. ఆశా కార్యకర్త ప్రభుత్వ విధులను కాదని గుంతలు తవ్వడమో.. సాగునీటి కాలువల్లో పూడిక తీయడమో.. లేక ఏదో ఒక పనికి వెళ్తున్నట్లు రికార్డుల్లో ఉంది. ఉపాధి హామీ పనుల్లో హాజరు వేయడం నుంచి జాబ్‌కార్డులు సృష్టించే వరకు ఎన్నో మోసాలకు తెరతీసి రూ.లక్షలు దోచుకున్న ఫీల్డ్ అసిస్టెంట్ లీలలివి.

- విద్యార్థులకు జాబ్‌కార్డులు
- ఆశా కార్యకర్తకు పనుల కల్పన
- చేయని పనులకు బిల్లులు
- ప్రభుత్వ సొమ్ము జేబులోకి
- సంగం మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్ లీలలు

సంగం: మండలంలోని మర్రిపాడు గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్‌ఏ) షాజహాన్ ఉపాధి పథకాన్ని అడ్డుపెట్టుకుని అక్రమార్జనకు తెరతీశాడు. ఆ ఊరిలో 732 జాబ్‌కార్డులున్నాయి. చనిపోయిన వ్యక్తి పేరును వాడుకుని రికార్డులు తయారుచేసి ప్రభుత్వ సొమ్మును స్వాహా చేశాడు. ఇంకా ఇక్కడి వారు బెంగళూరు, హైదరాబాద్, చెన్నైల్లో పనుల నిమిత్తం ఉంటున్నారు. వారి పేర్లతో సైతం జాబ్‌కార్డులు సృష్టించి.. పనులు చేస్తున్నట్లు రికార్డులు తయారు చేసి డబ్బు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి.

వారికి జాబ్‌కార్డులు


చదువుకుంటున్న విద్యార్థులకు సైతం షాజహాన్ జాబ్‌కార్డులు సృష్టించాడు. మర్రిపాడుకు చెందిన షేక్ రేష్మ ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఆంధ్రా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. ఈమెకు సైతం జాబ్‌కార్డు ఉన్నట్లు, ఉపాధి పనులు చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశాడు. ఫిబ్రవరి 1 నుంచి మార్చి 15వ తేదీలోపు 24 రోజులు రేష్మ పనులు చేసినట్లు చూపించడంతో గ్రామస్తులు ఆశ్చర్యపోతున్నారు. మరికొందరు విద్యార్థుల పేర్లతో జాబ్‌కార్డులు ఉండొచ్చని వారు అనుమానిస్తున్నారు.



వెలుగు ఉద్యోగి అన్నపూర్ణకు నగదు జమైనట్లుగా ఉన్న రికార్డు

పనికి వెళ్తున్నట్లు చూపించి..

సుజాత మర్రిపాడు గ్రామంలో ఆశా కార్యకర్తగా పనిచేస్తున్నారు. అయితే ఆమె ఫిబ్రవరి నెలలోనే 20 రోజులు పనిచేసినట్లు ఉపాధి రికార్డుల్లో నమోదై ఉంది. ఒక్కనెలలోనే ఇన్ని రోజులు చూపిస్తే ఇప్పటి వరకు ఆమె పేరుతో ఎఫ్‌ఏ ఎంత దోచుకుని ఉంటాడోనని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే వీఆర్‌ఏ మీనా 2018 సంవత్సరం నుంచి పనులు చేస్తున్నట్లు రికార్డుల్లో నమోదై ఉన్నట్లు చెబుతున్నారు. ఇంకా వెలుగు ఉద్యోగి అన్నపూర్ణ పనులు చేసినట్లు చూపించి సొమ్ము చేసుకున్నాడు. మర్రిపాడులోని ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌లో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణ్‌కుమార్ పేరును కూడా చేర్చిన షాజహాన్ సొమ్మును తన ఖాతాలో వేసుకున్నాడు.



బాబుసాహెబ్ అకౌంట్‌లో నగదు జమైనట్లుగా ఉన్న రికార్డు

పనిచేయకుండానే రికార్డులు

గ్రామంలోని చలమవాగు పెద్ద బ్రిడ్జి నుంచి కింది వరకు వందల మంది కూలీలతో పనులు చేసినట్లు ఎఫ్‌ఏ చూపించి డబ్బులు తీసుకున్నాడని.. అక్కడ ఒక్క తట్ట మట్టి కూడా తీయలేదని సంబంధిత రైతులు చెబుతున్నారు. ఇలా ఎన్నో పనులను చేయకుండానే చేసినట్లు చూపారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డబ్బు విత్‌డ్రా చేయడంలో షాజహాన్‌కు ఓ బ్యాంక్ ఉద్యోగి సహకరిస్తున్నట్లు తెలిసింది.

మామూళ్ల మత్తులో..

ఉపాధి పనులను పరిశీలించి అంతా సక్రమంగా జరుగుతుందా? లేదా? అని తెలుసుకోవాల్సిన అధికారులు మర్రిపాడు పంచాయతీలో అక్రమాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. షాజహాన్ ఇచ్చే మామూళ్లు తీసుకుని పై అధికారులు ఏమీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అంటున్నారు.

చనిపోయిన వ్యక్తి పేరుతో..

మర్రిపాడులోని బాబుసాహెబ్ అనే వృద్ధుడు గతేడాది జూలై ఒకటో తేదీన మృతిచెందాడు. ఆయన మరణాన్ని ధ్రువీకరిస్తూ వృద్ధాప్య పింఛన్‌ను సైతం తొలగించారు. ఫీల్డ్ అసిస్టెంట్ షాజహాన్ మాత్రం బాబుసాహెబ్ ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో 18 రోజులు ఉపాధి పనులు చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశాడు. బాబుసాహెబ్ ఖాతాలో ఫిబ్రవరి 13న రూ.1,362, 20న రూ.1,042, 27న రూ.1,357 డబ్బులు పడగా వాటిని తీసుకున్నాడు.

చర్యలు తీసుకోవాలి



కలెక్టర్ చొరవ తీసుకుని మర్రిపాడులో ఉపాధి పనుల్లో అక్రమాలపై విచారణ చేయించాలి. చనిపోయిన వారు, ఉద్యోగులు, విద్యార్థుల పేరుతో డబ్బు దోచుకుంటున్న ఫీల్డ్ అసిస్టెంట్ షాజహాన్‌పై చర్యలు తీసుకోవాలి.

– ముడి మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు, మర్రిపాడు

విధుల నుంచి తొలగించాలి



నిరుపేదలకు ఉపయోగపడాల్సిన ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ షాజహాన్‌ను విధుల నుంచి వెంటనే తొలగించాలి. అతను ఓ బ్యాంకులో సైతం ప్రైవేట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎం.సురేష్, సర్పంచ్, మర్రిపాడు

విచారణ జరిపిస్తాం

ఇటీవల జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీల్లో మర్రిపాడు గ్రామ పంచాయతీ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ షాజహాన్‌పై గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయిలో విచారణ చేయించి చర్యలు తీసుకుంటాం.

– గోపి, ఎంపీడీఓ, సంగం

రారని తెలిసినా.. వచ్చేస్తున్నారంటూ..

- తెలుగుదేశం పార్టీ తొండాట
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలపై సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం
- టీడీపీ తీరుపై ఎమ్మెల్యేల ఆగ్రహం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ప్రజాక్షేత్రంలో వైఎస్సార్‌సీపీతో పోటీ పడలేక టీడీపీ అడ్డదారులు తొక్కుతోంది. సోషల్ మీడియాను వేదికగా చేసుకుని అధికార పార్టీ ఎమ్మెల్యేలపై దుష్ప్రచారానికి తెరతీసింది. వారికి ఎల్లో మీడియా తోడైంది. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి వైఎస్సార్‌సీపీని వీడుతున్నారంటూ రెండురోజులుగా ప్రచారం చేస్తోంది. దీనిని ఆ ఇద్దరూ ఖండించారు.

కొత్తవారి కోసం..

టీడీపీ కొంతకాలంగా క్షేత్రస్థాయిలో సర్వేలు చేయిస్తోంది. మాజీలకు టికెట్లు ఇస్తే గెలుపు కష్టమని రిపోర్టులు తేటతెల్లం చేశాయి. దీనికితోడు పలు నియోజకవర్గాల్లో అభ్యర్థులు కూడా కరువయ్యారు. దీంతో కొత్త ముఖాల కోసం వేట సాగిస్తున్న టీడీపీ అధిష్టానం అధికార పార్టీ ఎమ్మెల్యేలకు గాలం వేస్తోంది. అయితే ప్రజాదరణ కోల్పోయిన ఎమ్మెల్యేలకు ఈదఫా టికెట్లు ఇవ్వనని ఏడాదిన్నర ముందే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెగేసి చెప్పారు. ఈ క్రమంలో టికెట్‌పై ఆశలు వదలుకున్న కొందరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో గోడ దూకారు. వారిపై వైఎస్సార్‌సీపీ అధిష్టానం సస్పెన్షన్ వేటు వేసింది. ఈ నేపథ్యంలో టీడీపీ సోషల్ మీడియా వేదికగా అధికార పార్టీ ఎమ్మెల్యేలపై మైండ్‌గేమ్‌కు తెరలేపింది.

వైఎస్ కుటుంబానికి విధేయుడు

కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వైఎస్ కుటుంబానికి విధేయుడిగా ఉన్నారు. వైఎస్సార్ మరణానంతరం జరిగిన పరిణామాలతో వైఎస్ జగన్ వెంట నడిచారు. ఓదార్పు యాత్ర నుంచి వెన్నంటి ఉన్నారు. 2012లో జరిగిన ఉపఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి ఘన విజయం సాధించారు. రాజకీయ విలువలున్న కుటుంబం నుంచి వచ్చిన ప్రసన్న ఇప్పటికి ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా విజయం సొంతం చేసుకున్నారు. ఆయన పార్టీ వీడతున్నాడంటూ తెలుగు తమ్ముళ్ల ప్రచారం చేస్తున్నారు. దీనిపై ప్రసన్న అభిమానులు మండిపడుతున్నారు. ఇప్పటికే కోవూరు నియోజకవర్గ అభివృద్ధికి సీఎం ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా నెల్లూరు బ్యారేజీకి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరు పెట్టారు. టీడీపీ తప్పుడు ప్రచారంపై ప్రసన్న ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగన్ వెంటే..

ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డి వైఎస్ కుటుంబానికి ఎంతో దగ్గరగా ఉన్నారు. వైఎస్ మరణానంతరం జరిగిన పరిణామాలతో మేకపాటి కుటుంబం జగన్ మోహన్‌రెడ్డి వెంట నడిచారు. అలాంటి వారిపై టీడీపీ సోషల్ మీడియా, తెలుగు తమ్ముళ్లు దుష్ప్రచారానికి దిగారు. దివంగత నేత మేకపాటి గౌతమ్‌రెడ్డితో జగన్‌మోహన్‌రెడ్డికి ఆత్మీయ స్నేహ బంధం ఉండేది. అదేవిధంగా ప్రస్తుత ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డితో స్నేహం ఉంది. కాగా పచ్చదండు కుట్ర పన్ని చేస్తున్న విష ప్రచారాన్ని విక్రమ్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు.

అబద్ధపు ప్రచారాలు సిగ్గుచేటు

- సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కోవూరు, ఆత్మకూరు ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి టీడీపీలోకి వెళ్తున్నారని అబద్ధపు ప్రచారాలు చేయడం సిగ్గు చేటని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. నెల్లూరులో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మంత్రి పదవి రాకపోతే పార్టీలు మారతారా?.. ఏదైనా మాట్లాడేటప్పుడు ఆలోచించి మాట్లాడాలని, ప్రజల్లో అపోహలు కల్పించే మాటలు ఇప్పటికైనా మానుకోవాలన్నారు. ఏదో మూడు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు గెలవగానే టీడీపీకి ఊపు వచ్చేసినట్లు ప్రచారాలు చేస్తున్నారన్నారు. వారు సంబరపడడం చూస్తుంటే ఆరిపోయే దీపానికి వెలుగు ఎక్కువ అన్నట్లుగా ఉందన్నారు.

నా ప్రయాణం సీఎం జగన్‌తోనే..

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి స్పష్టం



కోవూరు(విడవలూరు): 'నా చివరి రక్తపు బొట్టు వరకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే ప్రయాణం సాగిస్తా. ఆయన వెంటే మా కుటుంబం నడుస్తుంది.' అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. విడవలూరు మండలం ఆంజనేయపురంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొన్ని యూట్యూబ్ చానల్స్ పనికట్టుకొని నేను పార్టీ మారుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. ఈ విషయం ఎంతగానో బాధించిందన్నారు. కోవూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ నిధులిచ్చారన్నారు. తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరును నెల్లూరు బ్యారేజీకి పెట్టారన్నారు. అంతటి గొప్ప వ్యక్తిని వదిలి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. నేను జీవించినంత కాలం జగన్‌తోనే సాగుతానని.. నా మరణానంతరం నా కుమారుడు రజిత్‌కుమార్‌రెడ్డి కూడా ఆయన వెంటే నడుస్తారన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ టికెట్ మీద పోటీ చేసిన వారమంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మతోనే గెలిచామన్నారు. ఆయన బొమ్మ లేకుండా ఏ ఒక్కరు గెలిచే ప్రసక్తే లేదన్నారు. ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు మైండ్‌గేమ్ ఆడుతున్నాడని అందులో భాగంగానే తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

నెల్లూరు(టౌన్): ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 850 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్‌కు సంబంధించి 757 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 871 మందికి గానూ 778 మంది హాజరయ్యారు. 93 మంది గైర్హాజరయ్యారు.

రుణమాఫీ పేరుతో మోసగించిన చంద్రబాబు

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


ఆసరా మెగా చెక్కును పొదుపు మహిళలకు అందజేస్తున్న మంత్రి కాకాణి, పక్కన పీడీ సాంబశివారెడ్డి

పొదలకూరు: 2014 ఎన్నికల సమయంలో రుణమాఫీ చేస్తానని చంద్రబాబునాయుడు డ్వాక్రా మహిళలను మోసగించారని, అలాగే 2019 ఎన్నికలకు ముందు పసుపు–కుంకుమ పేరుతో ఓట్ల కోసం దగా చేశారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడో విడత నిధులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన క్రమంలో మంగళవారం స్థానికంగా ఉన్న కల్యాణ మండపంలో మంత్రి కాకాణి డ్వాక్రా మహిళలకు ఆసరా నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షనేత చంద్రబాబు అబద్ధాలు, మోసాలతోనే రాజకీయాలు వెళ్లదీస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదుపు మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటివరకు ఆసరా పథకం ద్వారా మూడు విడతల్లో రాష్ట్రంలోని 78,94,169 మంది ఆడపడుచులకు రూ.19,180 కోట్లు అందజేసినట్లు తెలిపారు. జిల్లాలో మూడు విడతల్లో 34,443 పొదుపు సంఘాలకు రూ.826 కోట్లు, సర్వేపల్లి నియోజకవర్గంలో 4,056 సంఘాలకు రూ.96.83 కోట్లు, ఇందులో పొదలకూరు మండలానికి మూడు విడతల్లో 1,074 సంఘాలకు రూ.25 కోట్లు అందజేసినట్లు తెలిపారు. మూడో విడతలో పొదలకూరు మండలంలోని పొదుపు మహిళలకు రూ.8,41,26,000 ఆసరా నిధులను అందజేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రాష్ట్రంలో 18.50 లక్షల మంది మహిళలు స్వయం ఉపాధి పొంది, వారు నెలకొల్పుతున్న యూనిట్ల ద్వారా మరో పది మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. డ్వాక్రా అధికారులు, ఉద్యోగులు అవకతవకలకు పాల్పడితే మహిళలు వెంటనే ఫిర్యాదు చేయాల ని సూచించారు. ఈ సందర్భంగా పొదుపు మహిళలు సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ముందుగా మంత్రి కాకాణి పొదుపు సంఘాలు ఏర్పాటు చేసిన వివిధ రకాల యూనిట్లను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, వైస్ ఎంపీపీలు వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సోమా అరుణ, సొసైటీ చైర్మన్ జి.గోపాల్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు కోనం చినబ్రహ్మయ్య, పి.రమణారెడ్డి, సర్పంచులు చిట్టెమ్మ, ఎ.లక్ష్మి, ఏసీ శ్రీనివాసులు, ఏపీఎం రోజ్‌మేరీ తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు రాజకీయాలు చంద్రశేఖర్‌రెడ్డి నైజం

• వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల



నెల్లూరు(బారకాసు): నమ్మిన వారిని నట్టేట ముంచడంతో పాటు రాజకీయాల్లో వెన్నుపోటు పొడవడం ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి నైజమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి ఓటు వేసి వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై చేస్తున్న విమర్శలకు ఆయన ఘాటుగా సమాధానమిచ్చారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భిక్షతో రెండుసార్లు ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా విజయం సాధించిన చంద్రశేఖర్‌రెడ్డి పార్టీకి ద్రోహం చేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కోట్లాది రూపాయలకు ఓటును అమ్ముకున్న ఆయన నీతులు చెబితే ప్రజలు నవ్వుతారన్నారు. ఆయన అవినీతి చిట్టా పార్టీ అధిష్టానానికి తెలియడంతో వచ్చే ఎన్నికల్లో సీటు ఇవ్వరని తెలుసుకుని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటును అమ్ముకున్నారని ధ్వజమెత్తారు. ఆయనకు దమ్ము, ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా తనపై పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు.

ఫేక్ కాల్‌తో హడలెత్తించిన వ్యక్తి అరెస్ట్

జలదంకి: జలదంకి పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిపాళేనికి చెందిన జిర్రా చంద్రారెడ్డి 100కు ఫేక్ కాల్ చేయడంతో పోలీసులు అతన్ని అరెస్ట్ చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై వీరేంద్రబాబు వివరాల మేరకు.. చంద్రారెడ్డి 100కు కాల్ చేసి తన ఇంట్లో గొడవలు జరుగుతున్నాయని, మా అమ్మను మొద్దుకత్తిలో నరికి వేసినట్లు తెలిపాడు. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా చంద్రారెడ్డి మద్యం తాగి ఫోన్ చేసినట్లు గుర్తించారు. అక్కడ ఎలాంటి ఘటన జరగకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. చంద్రారెడ్డి అమ్మను విచారించగా రోజూ మద్యం తాగి గొడవపడతాడని తెలిపింది. పోలీసులు చంద్రారెడ్డిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

ఏరువాక కేంద్రం బాపట్లకు మార్పు


ఓబయ్యను సన్మానిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాకు సంబంధించి వ్యవసాయశాఖకు అనుబంధంగా ఉన్న ఏరువాక కేంద్రాన్ని జిల్లా నుంచి బాపట్ల జిల్లాకు మారుస్తున్నట్లు వ్యవసాయశాఖ జేడీ సుధాకర్‌రాజు తెలిపారు. స్థానిక మద్రాసు బస్టాండ్ ప్రాంతంలో ఉన్న రైతుశిక్షణ కేంద్రంలో ఏరువాక కేంద్రం జిల్లా అధికారి ఓబయ్యను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ కొత్త జిల్లాల ఏర్పాటు అనంతరం నెల్లూరులోని ఏరువాక కేంద్రాన్ని ఉన్నతాధికారులు ఆదేశాలతో ఏప్రిల్ నుంచి బాపట్ల జిల్లాకు మారుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు సురేఖాదేవి, శివన్నారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలి

• కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు


మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ ప్రాధాన్యత ఉన్న అన్నిరంగాలకు బ్యాంకర్లు విరివిగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు బ్యాంకర్లకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో డీసీసీ జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తూ ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకర్ల ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు పథకంలో బ్యాంకర్లు తప్పనిసరిగా భాగస్వాములు కావాలని తెలిపారు. పొదుపు సంఘాల్లోని మహిళలకు వడ్డీ లేని రూ.35 వేల రుణాన్ని వందశాతం అందించాలన్నారు. ఏప్రిల్ 15 నాటికి 10 వేల ఇళ్లు పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, ఇందుకు బ్యాంకర్లు సహకరించాలని తెలిపారు. వ్యవసాయ సీజన్లలో రైతులకు అధికంగా పంట రుణాలు అందించాలన్నారు. ముద్ర, టిడ్కో గృహాలకు వ్యవసాయ, విద్య, ఎంఎస్ఎంఈ తదితర అన్నిరకాల పథకాలకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలని తెలిపారు. ప్రైవేట్ బ్యాంకర్లు కొన్నిచోట్ల నిర్లక్ష్యంగా వహిస్తున్నారని, ఆర్‌బీఐ సూచనలకనుగుణంగా కచ్చితంగా లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. జిల్లాలోని 385 బ్రాంచ్‌ల బ్యాంకర్లు టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ ఏజీఎం హనుమకుమారి, నాబార్డు డీడీఎం రవిసింగ్, మెప్మా పీడీ రవీంద్ర, వ్యవసాయశాఖ జిల్లా అధికారి సుధాకర్‌రాజు, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, పశుసంవర్ధకశాఖ జేడీ మహేశ్వరుడు, జిల్లా ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసరావు, ఎన్‌డీసీసీ బ్యాంకు సీఈఓ శంకర్‌బాబు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	:124
లేయర్ (లైవ్)	:75
బ్రాయిలర్ చికెన్	:216
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:240
లేయర్ చికెన్	:128



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	:రూ.70
సన్నవి	:రూ.60
పండ్లు	:రూ.25



అంగన్‌వాడీ కేంద్రాల ఆధునికీకరణకు రూ.38 లక్షలు

• ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ నవీన్‌చంద్ర


అంగన్‌వాడీ చిన్నారులకు చాక్లెట్స్ పంపిణీ చేస్తున్న ఎస్‌బీఐ అధికారులు

నెల్లూరు(వేదాయపాళెం): రాష్ట్రంలో 34 అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునికీకరించేందుకు రూ.38 లక్షలు కేటాయించినట్లు ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ చీఫ్ మేనేజర్ నవీన్‌చంద్ర తెలిపారు. రంగనాయకులపేట, యాదవవీధిలోని అంగన్‌వాడీ కేంద్రం ఆధునికీకరణ పనులను ఆయన మంగళవారం ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రానికి ఆర్వో ప్లాంటు, స్మార్ట్ టీవీ, ట్యాబ్‌లు, కబోర్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత, మహిళల ఆరోగ్య సంరక్షణ, గ్రామీణాభివృద్ధికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కృషి చేస్తోందన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా ఈ ఏడాది విస్తృతంగా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆధునికీకరణ పనులను నెల్లూరు నుంచే లాంఛనంగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం చిన్నారులకు చాక్లెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజినల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ వరదరాజన్, నెల్లూరు రీజనల్ మేనేజర్లు శ్రీనివాసరావు, లక్ష్మి, శేషగిరిరావు, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఎఫ్‌ఆర్‌ఎస్ తప్పనిసరి

• డీఎంహెచ్‌ఓ పెంచలయ్య


సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

చేజర్ల: ఉద్యోగులందరూ తప్పనిసరిగా ఎఫ్‌ఆర్‌ఎస్(ఫేస్ రికగ్నైజ్డ్ సిస్టమ్) హాజరు వేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పెంచలయ్య తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ ప్రసవాల గదిని, ఫార్మసీ, వ్యాక్సిన్ గదులను, రికార్డులను పరిశీలించారు. అనంతరం డాక్టర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలతో నిర్వహించిన సమీక్ష సమావేశం మాట్లాడారు. పీహెచ్‌సీల్లో ఒకరు లేదా ఇద్దరు రోగ లక్షణ వ్యక్తులకు కోవిడ్ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఈజేఏస్వై, పీఎంఎంవీవై (ప్రధానమంత్రి మాతృ వందన యోజన) పథకాలకు సంబంధించి పెండింగ్‌లను పూర్తి చేయాలని కోరారు. పీఎంఎంవీవై పథకంలో మొదటి కాన్పునకు రూ.5 వేలు అందజేస్తారని, రెండో కాన్పులో ఆడబిడ్డను ప్రసవిస్తే ఆ బిడ్డకు కూడా ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ప్రతి రోజూ గర్భిణులు, బాలింతలకు రక్తపరీక్షలు చెయ్యాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రమీలారాజకుమారి, డాక్టర్ ఎస్‌కే మస్తాన్, సీహెచ్‌ఓ చంద్రయ్య, సూపర్‌వైజర్లు, నర్సులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

రైల్వే మూడో లైన్ ప్రారంభం



ఉలవపాడు: మండల కేంద్రమైన ఉలవపాడు రైల్వేస్టేషన్ సమీపంలో నూతనంగా నిర్మించిన మూడో రైల్వే ట్రాక్‌ను సెంట్రల్ రైల్వే భద్రతా అధికారి ప్రాన్‌జీవ్ సక్సేనా, దక్షిణ మధ్య రైల్వే డీఆర్‌ఎం శివేంద్రమోహన్ మంగళవారం ప్రారంభించారు. నాణ్యత, భద్రతా ప్రమాణాలతో మూడో లైన్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 4వ నంబర్ ప్లాట్‌ఫాం మీదుగా ఉలవపాడులో ఈ లైన్ వెళుతుంది. జెండా ఊపి రైలును ఈ లైన్‌పై నడిపి ప్రారంభించారు. అనంతరం ఉలవపాడులోని ప్రజా సంఘాల నాయకులు పలు సమస్యలను వారికి తెలియజేశారు. ఉలవపాడు మామిడి, సపోట వ్యాపారాలకు కేంద్రం అయినందున ఎక్స్‌ప్రెస్‌లు నిలపాలని కోరారు. రామాయపట్నంలో ఓడరేవు కూడా నిర్మిస్తున్న నేపథ్యంలో అదనపు రైళ్ల సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డీకేడబ్ల్యూకు న్యాక్ గుర్తింపు

నెల్లూరు(టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలకు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(బెంగళూరు) గుర్తింపు లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ గిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలకు న్యాక్ ఏ–గ్రేడ్ గుర్తింపు రావడానికి కృషి చేసిన, ప్రోత్సహించిన కలెక్టర్ చక్రధర్‌బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ముగ్గురు పోలీసు సిబ్బందిపై చర్యలు?

నెల్లూరు(క్రైమ్): పేకాటాడుతూ పట్టుబడిన పోలీసులపై విచారణ నివేదిక మంగళవారం ఎస్పీ విజయారావుకు అందింది. దీంతో సదరు సిబ్బందిపై సస్పెన్షన్‌కు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. వివరాలు.. చెముడుగుంట నక్కలకాలనీ సమీపంలో పేకాడుతున్నారని ఆదివారం రాత్రి వెంకటాచలం పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఇన్‌స్పెక్టర్ జి.గంగాధర్ తన సిబ్బందితో కలిసి దాడి చేయగా జూదరులు కొందరు పరారయ్యారు. ఈ ఘటనలో హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, కానిస్టేబుల్స్ శ్రీనివాసులు, నందకుమార్ పట్టుబడిన విషయం విదితమే. దీనిపై నివేదిక ఇవ్వాలని నెల్లూరురూరల్ డీఎస్పీ పి.వీరాంజనేయరెడ్డిని ఆదేశించారు. దీంతో డీఎస్పీ నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ గంగాధర్ మంగళవారం నివేదికను ఎస్పీ విజయారావుకు అందజేసినట్లు తెలిసింది. ముగ్గురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడనున్నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే ముగ్గురు సిబ్బందిని వారు పనిచేస్తున్న ప్రాంతాల నుంచి హెడ్‌క్వార్టర్స్‌కు పంపాలని ఆయా ప్రాంత పోలీసు అధికారులకు ఆదేశాలు అందాయి.